

తెలంగాణకు అన్యాయం
కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపు లేమీ చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.
- 10లో



గంజాయి ముఠా అరెస్ట్
గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను మిర్యాలగూడ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు.
- 10లో



తల్లిపాలే అమృతం
వచ్చేనెల 1వ తేదీ నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. వారం పాటు కొనసాగనున్నాయి.
- 11లో

మళ్లీ అదే సమస్య!



ఈ ఫొటోలోని వ్యక్తి చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామానికి చెందిన ముప్పిడి పరమేష్ గౌడ్. చౌటుప్పల్ యూనియన్ బ్యాంకులో గత సంవత్సరం రూ.లక్ష పంట రుణం తీసుకున్నాడు. మొదటి జాబితాలో రుణమాఫీ కాలేదని అధికారులను ఆశ్రయిస్తే రెండో విడతలో అవుతుందని చెప్పారు కాని కాలేదు. దండు మల్కాపురంలోని భూమిపై తన భార్య పేరిట స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ. 50వేల రుణం ఉన్నది. ఇద్దరిలో ఎవరి రుణం కూడా మాఫీ కాలేదు.



ఈయన పేరు పోచంపల్లికి చెందిన మద్ది సుదర్శన్‌రెడ్డి. 2009లో పంట పెట్టుబడి కోసం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రూ.1.30 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లిస్తూ వస్తున్నాడు. గత మూడు నెలల క్రితం రూ.3500 వడ్డీ చెల్లించాడు. తన భార్య మద్ది కళమ్మ పేరున స్థానిక ఎస్బీఐ బ్యాంకులో తీసుకొన్న పంటరుణం రూ.1.39 లక్షలు బకాయి ఉంది. అయితే రెండో విడత జాబితాలో ఇద్దరి పేరు లేదు.



అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవి కాలువ గ్రామానికి చెందిన కేసరపు సునీత తనకున్న 35 గుంటల వ్యవసాయ భూమి పేరున స్థానిక పీఏసీఎస్‌లో రూ.25 వేల రుణం తీసుకుంది. వడ్డీతో కలిపి రూ.38 వేలు అయింది. మొదటి విడత జాబితాలో ఈమే పేరు లేదు. తీరా రెండో విడత జాబితాలో కూడా తన పేరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తోంది. వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోమని చెప్పారని పేర్కొంది.

పలువురు రైతులకు వర్తించని రుణమాఫీ

- గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసినా రెండో విడతలోనూ జమకాని నిధులు
- ఆందోళన చెందుతున్న రైతులు

సాక్షి, యాదాద్రి: రైతు రుణమాఫీ రెండో విడతలోనూ అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఈనెల 18వ తేదీన చేసిన మొదటి విడత రుణమాఫీలో ఏయే సమస్యలతో రుణమాఫీ కాలేదో ఇప్పుడూ అవే సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం..
ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం మొదటి, రెండు విడతల్లో జిల్లాలో 51,278 రైతుల ఖాతాలకు గాను రూ.358.78 కోట్లు రుణమాఫీ చేసినట్లు ప్రకటించారు. తొలి విడతలో 33,151 రుణ ఖాతాలకు రూ.181.29 కోట్లు, రెండో విడతలో 18,127 రుణఖాతాలకు గాను రూ.177.48 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సంఖ్యకు రైతుల ఖాతాల్లో జమవుతున్న సంఖ్యకు తేడా ఉంది.

గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నా
ఖాతాదారుడి చెల్లని ఆధార్ నంబర్, డేటా సమాచారం లేకపోవడం, ఆధార్‌లోని పేరు, రుణఖాతాలోని పేరు వేర్వేరుగా ఉండడం, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, పట్టాపాస్ పుస్తకం లేకపోవడం, కుటుంబంలో సర్వీస్ పింఛన్‌దారు ఉండడం, రేషన్‌కార్డు లేకపోవడం, రుణమాఫీ కటాఫ్ తేదీ ప్రకారం లేకపోవడం, బ్యాంకు అకౌంట్ క్లోజ్ అయి ఉండడం, వేర్వేరు వ్యక్తులకు ఒకే ఖాతా ఉండడం, రైతులు చనిపోయి ఉండడం వంటి కారణాలతో రుణ మాఫీ కాకపోవడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని వారి కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో 272 మంది దరఖాస్తులు చేసుకున్నా వారి అకౌంట్లలో రెండో విడత నాటికి కూడా డబ్బులు జమ కాలేదు.



రైతు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

రైతుల మేలు కోసమే రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసమే రుణమాఫీ పథకం తీసుకువచ్చిందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మంగళవారం రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో రైతులు, వ్యవసాయ, కోఆపరేటివ్, బ్యాంకర్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ నిధుల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి క్లస్టర్‌లోని రైతు వేదికలో రైతులు తమ ఆధార్ వివరాలతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదిస్తే వారు కావాల్సిన అన్ని విషయాలపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. బ్యాంకర్లు రుణమాఫీ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణ మాఫీని రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, రెన్యువల్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో రుణమాఫీపై ఎలాంటి సమస్యలు వచ్చినా 08685- 293312 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు. అనంతరం రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మరమ్మతులతో రైల్వే గేటు మూసివేత

చౌటుప్పల్, వలిగొండ: చౌటుప్పల్‌- వలిగొండ రోడ్డు మార్గంలో నాగారం గ్రామ శివారులోని రైల్వేగేటును తాత్కాలికంగా రెండు రోజుల పాటు (బుధ, గురువారం) మూసివేస్తున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎం.రాంభద్రారావు మంగళవారం తెలిపారు. వలిగొండ-రామన్నపేట స్టేషన్‌ల నడుమ ఉన్న గేట్ నంబర్‌-16 వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఇరువైపులా రాకపోకలు ఉండవని పేర్కొన్నారు. ఈ రెండు రోజులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణాలు సాగించాలని సూచించారు.

వరకట్న నిషేధంపై చైతన్య సదస్సు



మాట్లాడుతున్న శంకర్

భువనగిరి క్రైం: భువనగిరి కోర్టు ప్రాంగణంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సఖి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వరకట్నం నిషేధంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరకట్న నిషేధం, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భువనగిరి న్యాయ సహాయ కేంద్రం చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శంకర్, సఖి కేంద్రం ఎన్‌జీఓ డాక్టర్ ప్రమీల, సఖి అడ్మిన్ లావణ్య, సుమలత పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందని ఇన్‌చార్జ్ డీఈఓ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన 68వ పాఠశాలల క్రీడా సమాఖ్య వ్యాయామ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాతి కృష్ణమూర్తి, విజయ సాగర్, స్టాలిన్ బాబు, ప్రసాద్‌రావు, పూల నాగయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డీపీఈడీ, బీపీఈడీ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్ : ఎంజీయూ పరిధిలోని డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ), బ్యాచిలర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మూడు, రెండు, ఒకటో సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను రిజిస్ట్రార్ అల్వాల రవి మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ డీపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 62 శాతం, బీపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్‌లో 83.4 శాతం శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

రెండున్నరేళ్లుగా నిరీక్షణ

- విద్యార్థులకు అందని ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు
- రెండు సంవత్సరాలకు కలిపి రూ.57.23 లక్షలు పెండింగ్

ఆలేరురూరల్: విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో చదువు మానేయకుండా ఉండేందుకు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాల వెళ్లేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి నెలకు రూ.300 చొప్పున ట్రాన్స్‌పోర్ట్ చార్జీల కింద అందజేస్తుంది. అయితే ఈ చార్జీలకు సంబంధించిన నిధులు గత రెండన్నరేళ్లుగా విడుదల కావడం లేదు. జిల్లాలో 421 గ్రామాలు ఉండగా, 729 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 55,204 మంది విద్యార్థులు చదువుతున్నారు.



పెండింగ్‌లో రూ.57.23 లక్షల నిధులు
టాన్స్‌పోర్ట్ చార్జీల కోసం జిల్లాలో 2022-23లో 1162 మంది విద్యార్థులకు సంబంధించి రూ.26.95 లక్షలు, 2023-24లో 1063 మంది విద్యార్థులకు 30.28 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండు విద్యా సంవత్సరాలకు కలిపి మొత్తం సుమారు రూ.57.23 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటివరకు టాన్స్‌పోర్ట్ చార్జీలు విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలి. గ్రామాల నుంచి పట్టణాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల డ్రాప్ ఔట్ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం విద్యార్థులకు ప్రతి నెలా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అందిస్తే కొంతవరకు డ్రాప్ ఔట్ నివారించవచ్చు. విద్యార్థులు తల్లిదండ్రులకు కూడా భారం కాకుండా ఉంటుంది. – నవీన్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపాం
బస్సు సౌకర్యం లేని గ్రామాల్లోని విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లేందుకు ప్రభుత్వం నెలకు రూ.300 చొప్పున ట్రాన్స్‌పోర్ట్ చార్జీ అందజేస్తుంది. రెండేళ్లకు సంబంధించి నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపించాం. ఆ నిధులు నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ అవుతాయి.
– ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ

‘మహిళా శక్తి’ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే ‘మహిళా శక్తి’ పథకం ముఖ్య ఉద్దేశ్యమని, ఈ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా శక్తి కార్యక్రమంపై సంబంధిత శాఖలైన గ్రామీణ అభివృద్ధి, సెర్ప్, నాబార్డ్, లీడ్ బ్యాంకు, పశు, మత్స్య, వ్యవసాయ, స్త్రీనిధి, పరిశ్రమలు, విజయ డెయిరీ తదితర శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రణాళిక రూపకల్పన, అమలుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాల్లో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం, ఉత్పత్తి అయిన సరుకులకు మార్కెటింగ్ ప్రణాళికలు మహిళాశక్తి పథకంలో భాగమని తెలిపారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మినెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్ లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు తదితర 14 రకాల జీవనోపాధులు ఇందులో భాగంగా ఉన్నాయని చెప్పారు. ఈ పథకంలో జిల్లాలో 2024- 25కుగాను 12,451 యూనిట్లకు వర్తింపజేయనున్నట్లు చెప్పారు. బ్యాంకులు ముందుగానే కావాల్సిన డాక్యుమెంట్ల చెక్ లిస్ట్ గ్రూపులకు అందించి రుణ సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. ముందుగా కొన్ని మోడల్ పైలట్ ప్రాజెక్టులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శులు సంతోష, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి కాల్వలు పూర్తి చేయాలి

గుండాల: గుండాల మండలానికి సాగు నీరు అందించే నవాబుపేట రిజర్వాయర్, అసంపూర్తిగా మిగిలిపోయిన కాల్వలను తక్షణమే పూర్తి చేసి సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. శాసన సభ్యుల నిర్లక్ష్యంతో బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాల్వ, బస్వాపురం, గంధమల్లకు రూపాయి కేటాయించలేదన్నారు. యాదాద్రి క్షేత్రంలో అసంపూర్తి పనులకు నిధులు కేటాయించకపోవడంపై ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుసుమని హరిశ్చంద్ర, మండల కార్యవర్గ సభ్యుడు గుర్రం మోహన్‌రెడ్డి, గూడెపు వెంకటయ్య, ఉప్పల కొమురయ్య, బద్దుల శ్రీను, స్వామి, బక్కయ్య, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లపై బాధ్యత పెరిగింది



డ్రైవర్లను సన్మానిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఇతర అధికారులు

- సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లపై బాధ్యత పెరిగిందని, ఎక్కువ దూరం ప్రయాణం చేసే సమయంలో కొంత విరామం తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. మంగళవారం సూర్యాపేట ఆర్టీసీ డిపో ఆవరణలో నల్లగొండ రీజియన్ స్థాయి ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ప్రమాద రహితంగా బస్సులు నడిపిన 21 మంది ఉత్తమ డ్రైవర్లకు అవార్డులను ఎస్పీ ప్రదానం చేసి మాట్లాడారు. అవార్డులు పొందడంతో డ్రైవర్లు ఆగిపోకుండా మంచి సర్వీస్ అందించి ఇతర డ్రైవర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించడాన్ని ఆర్టీసీ సిబ్బంది సామాజిక సేవగా భావించాలన్నారు. హత్యల్లో జరిగే మరణాల కన్నా రోడ్డు ప్రమాదాల రూపంలో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఎక్కువమంది ప్రయాణించే బస్సులు ప్రమాదానికి గురైతే ప్రాణ నష్టం అధికంగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆర్టీసీ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ రాజశేఖర్, ఎంవీఐ జయప్రకాశ్ రెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవి, శివశంకర్ పాల్గొన్నారు.

సైబర్.. హడల్

- కొత్తరకం మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. రుణమాఫీ వచ్చిందా అని ఫోన్ చేస్తున్న కేటుగాళ్లు
- ఓటీపీ పంపించి అకౌంట్ ఖాళీ చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు



సాక్షి, యాదాద్రి : సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. రుణమాఫీ వచ్చిందా అని ఓటీపీ చెప్పాలని క్షణాల్లో డబ్బులు దోచేస్తున్నారు. ఏదో ఒక ఆఫర్ పెట్టి సోషల్‌మీడియా ద్వారా లింక్ పంపించి మోసానికి పాల్పడుతున్నారు. తీరా అకౌంట్‌లో నగదు కోల్పోగానే బాధితులు లబోదిబోమంటున్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు ఈ సైబర్‌నేరగాళ్ల చేతిలో ఆర్థిక దోపిడీకి బలవుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదోఒక చోట ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అయితే సైబర్ మోసాల పట్ల అప్రమత్తతంగా ఉంచాలని పోలీస్ శాఖ సూచిస్తోంది. ఈ మేరకు జనాలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డబ్బులు కోల్పోయిన గంటలోపు 100, 1930కి ఫోన్ చేయాలని పోలీసులు పేర్కొంటున్నారు.

కుమారుడు కేసులో ఇరుక్కున్నాడని..
అమెరికాలో ఉన్న మీ కొడుకు కేసులో ఇరుక్కోవడంతో పోలీస్ కేసు అయ్యిందని, కేసు నుంచి తప్పించడానికి రూ.లక్ష పంపించాలని ఇటీవల ఆలేరుకు చెందిన ఓ వ్యక్తికి బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చింది. ఆందోళన చెందిన అతను అపరిచిత వ్యక్తి చెప్పిన సెల్ నంబర్‌కు రూ.50 వేలు పంపించాడు. అనుమానం రావడంతో తన కొడుకుకు ఫోన్ చేసి అసలు విషయం తెలుసుకున్నాడు. దీంతో సైబర్ క్రైం పోలీస్‌లు, స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకుని..
బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన జ్యూయలరీ షాప్ యజమాని రూ.1,36,500 సైబర్ క్రైమ్ మోసానికి బలయ్యాడు. గ్రామంలో గల ఓ చికెన్ సెంటర్ యజమానికి ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తను ఆర్మీ ఆఫీసర్‌గా పరిచయం చేసుకున్నాడు. పది కిలోల చికెన్ అవసరం ఉందని ఫోన్లో ఆర్డర్ చేశాడు. చికెన్ సిద్ధం చేసి అపరిచిత వ్యక్తికి తిరిగి ఫోన్ చేశాడు. చికెన్ బిల్ చెల్లించేందుకు నీ వద్ద ఫోన్ పే, గూగుల్ పే ఉంటే ఒక రూపాయి పంపమని అపరిచిత వ్యక్తి చికెన్ సెంటర్ యజమానికి సూచించాడు. చికెన్ సెంటర్ యజమాని తన వద్ద స్కానర్ ఉండడంతో సమీపంలోని జ్యూయలరీ షాపు యజమాని ఆశ్రయించి అపరిచిత వ్యక్తికి ఒక రూపాయి పంపాడు. కానీ అపరిచిత వ్యక్తి మీ చికెన్ బిల్లు మొత్తం ఎంత ఉందో మొత్తం తమకు ఫోన్ పే చేస్తే తిరిగి మొత్తాన్ని డబుల్ ఫోన్ పే చేస్తామని నమ్మబలికాడు. ఇలా పలుమార్లు జ్యూయలరీ షాప్ యజమాని రూ.లక్షా 36,500 మోసపోయాడు. 15 రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించాడు.

మున్సిపల్ అధికారినని..
మోత్కూర్ మున్సిపల్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓ వ్యాపారికి సైబర్ నేరగాడు రూ.16 వేలకు టోకరా పెట్టాడు. మోత్కూర్‌కు చెందిన ఓ వ్యాపారికి ఈనెల 15న గుర్తు తెలియని వ్యక్తి మున్సిపల్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పాడు. షాపు ట్రేడ్ లైసెన్స్ టాక్స్ కట్టాలని చెప్పాడు. ఇది నమ్మి అతడి ఫోన్ పే నంబర్‌కు ట్రేడ్ లైసెన్స్ కోసం రూ.9950, లేబర్ లైసెన్స్‌కు రూ.6250 పంపించాడు. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బంధువులకు సీరియస్‌గా ఉందని..
ఆత్మకూర్(ఎం) మండల కేంద్రానికి చెందిన కుమార్ అనే వ్యక్తికి జనవరిలో తెలిసిన వ్యక్తుల మాదిరిగా ఫోన్ చేసి తమ బంధువులకు సీరియస్ గా ఉందని అర్జెంట్‌గా ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు కావాలంటూ చెప్పాడు. దీంతో అతను చెప్పిన అకౌంట్‌కు రూ. 60 వేలు పంపించాడు. తీరా ఫోన్ చేసిన వ్యక్తి తమ బంధువు కాకపోయేసరికి, తాను మోసాయనని గ్రహించి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు.

ఏఎస్‌ఐ పేరు చెప్పి..
గుర్తుతెలియని వ్యక్తి ఏఎస్‌ఐగా పరిచయం చేసుకుని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు రూ.85000 టోకరా వేశాడు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పెట్రోల్ బంక్ నిర్వాహకుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఏఎస్‌ఐ మాట్లాడుతున్నానని, అత్యవసరంగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.85,000 ఫోన్ పే చేయాలని కోరాడు. దీంతో వారు రూ.25,000 ఒకసారి, మరోసారి రూ.60,000 ఫోన్ పే చేశాడు. అనంతరం అదేనంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ట్రూ కాలర్‌లో నంబర్‌ను పరిశీలించగా జార్ఖండ్ రాష్ట్రం నుంచి ఫోన్ చేసినట్లు చూపించింది. మోసపోయినట్లు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

వడివడిగా..

- శ్రీశైలం నుంచి సాగర్‌కు భారీగా వరద
- వేగంగా పెరుగుతున్న సాగర్ నీటిమట్టం
- ఒక్క రోజులోనే 24 టీఎంసీల నీరు రాక



మంగళవారం సాయంత్రం 517 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్: కృష్ణానదికి ఎగువ నుంచి వరద పెరగడంతో శ్రీశైలం ప్రాజెక్టు ఏడు క్రస్ట్‌గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే మీదుగా 1,91387 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 61వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. మొత్తంగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 2,52,386 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 517.20 అడుగులకు చేరింది. 144.2194 టీఎంసీల నీరు ఉంది. సాగర్‌లో సోమవారం సాయంత్రం వరకు 503.50 అడుగులు ఉన్న నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 14అడుగులు పెరిగింది. 24టీఎంసీల నీరు వచ్చి చేరింది. శ్రీశైలంలో సోమవారం మూడు గేట్లు ఎత్తిన అధికారులు.. మంగళవారం ఏడు గేట్లు ఎత్తారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయికి అంటే 590 అడుగులు చేరడానికి 168 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. ఎగువన శ్రీశైలం నుంచి ఇదే రీతిలో వరద వస్తే వారం రోజుల్లో సాగర్ కూడా పూర్తిస్థాయిలో నిండనుంది.

నారుమళ్లకు నీరివ్వండి
నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో నారుమళ్లకు నీరివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు వరద ప్రారంభం కావడంతో నీటి విడుదలకు వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని కోరుతున్నారు. నీటిని విడుదల చేయడం వల్ల కాల్వ మీద ఆధారపడిన రైతులు నార్లు పోసుకుంటారని.. 25 రోజుల తర్వాత నాట్లు వేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. సాగర్ ఎడమకాల్వ కింద ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో 2,81,683 ఎకరాలు ఉండగా లిఫ్టుల కింద 86,641 ఎకరాల భూమి ఉంది. మొత్తం 3,68,324 ఎకరాల ఆయకట్టు ఉంది.

కాల్వకు నీటిని విడుదల చేయాలి



ఆయకట్టులో సాగునీటి కోసం ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు నీటిని విడుదల చేస్తే నార్లు పోసుకుంటాం. నెలలో నాట్లు వేస్తాం. విడతల వారీగా నీరు విడుదల చేస్తే పొలాలు తడిపేందుకు వీలవుతుంది. నీరు వృథా కాదు. ఎగువ నుంచి వరద వస్తున్నందున వెంటనే నీటిని విడుదల చేయాలి.
– కట్టా మాధవరెడ్డి, రైతు, యాద్గార్‌పల్లి

క్లుప్తంగా

ట్రాక్టర్లలోని బ్యాటరీలు చోరీ



చోరీకి గురైన ట్రాక్టర్‌లోని బ్యాటరీ

అర్వపల్లి: శాలిగౌరారం మండలం కలాన్‌మాధవరం నుంచి జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి వరకు ఆయా గ్రామాల్లో నకిరేకల్‌–తానంచర్ల 365వ నంబర్‌ జాతీయ రహదారి వెంట నిలిపి ఉన్న ట్రాక్టర్లలోని బ్యాటరీలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు 30 ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగిలించారు. ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.8000 ఉంటుందని ట్రాక్టర్ల యజమానులు తెలిపారు. గతంలో కూడా సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి వెంట నిలిపి ఉన్న వాహనాల టైర్లు, బ్యాటరీలను దొంగలు చోరీ చేశారు. పోలీసులు విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలని ట్రాక్టర్ల యజమానులు కోరుతున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మోటకొండూర్‌: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మోటకొండూర్‌ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. మోటకొండూర్‌ మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు బొల్లపల్లి సత్తయ్య మంగళవారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. తీవ్రగాయాలపాలైన సత్తయ్యను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. క్షతగాత్రుడి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్‌: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చౌటుప్పల్‌ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన బొలమోని సంజీవ(20) తన తండ్రి, నాయనమ్మతో కలిసి ఉంటున్నాడు. ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాడు. సంజీవ గ్రామంలోని ఎంఎంఆర్‌ వ్యాయామ కళాశాలకు చెందిన స్టేడియం సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న కాలనీవాసులు, పరిసరాలలో మేకలు మేపుతున్న వ్యక్తులు గుర్తించి స్థానికులకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంజీవ మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల అపహరణ

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గొర్రెలు, గొర్రె పొట్టేళ్లను అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉరుమడ్ల గ్రామానికి చెందిన జాల యాదయ్య, జాల లింగయ్య, జాల శ్రీను, జాల నర్సింహ తమ గొర్రెలు, గొర్రె పొట్టేళ్లను సోమవారం రాత్రి గ్రామ శివారులోని తమ దొడ్డిల వద్ద ఉంచి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం వారు వెళ్లి చూసేసరికి మందలోని పద్నాలుగు గొర్రెలు, గొర్రె పొట్టేళ్లు కనిపించలేదు. వాటి విలువ రూ.2లక్షల ఉంటుందని బాధితులు తెలిపారు. ఐదు రోజుల క్రితం జాల నర్సింహకు చెందిన నాలుగు గొర్రె పొట్టేళ్లను సైతం దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితులు మంగళవారం చిట్యాల పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- బీజేపీ విధానాలను వ్యతిరేకించాలి
- రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సీపీఎం ప్లీనరీలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

వలిగొండ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఏమీ చేయలేదని, తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ ఎంపీలు నోరుమెదపడం లేదని, రాష్ట్ర ప్రజలకు వారు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే న్యాయబద్ధమైన పోరాటంలో సహకరిస్తామని అన్నారు. తమ్మినేని మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి ప్లీనరీలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ పూర్తిగా అన్యాయం చేశారని అన్నారు. బీజేపీని ఎదుర్కోవడంలో ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్‌ కార్డు కూడా ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం రేషన్‌ కార్డుల పంపిణీలో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పేద ప్రజలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ నాయకులు మాటూరి బాల్‌ రాజు, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, మద్దెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ శైవాగమ సదస్సు



మాట్లాడుతున్న పుల్లేటికుర్తి గణపతిశర్మ

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీసోమేశ్వర శివజ్ఞాన పీఠం వేదికగా మూడురోజుల పాటు నిర్వహించిన జాతీయ శైవాగమ సదస్సు మంగళవారంతో ముగిసింది. తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం, రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాచార్యులు పుల్లేటికుర్తి గణపతిశర్మ హాజరై మాట్లాడారు.. ఆధ్యాత్మికతతో చొచ్చుకొస్తున్న ఆధునికత నేపథ్యంలో పీఠాధిపతులు సూచించిన ఆగమ శాస్త్రాల ప్రాభవం, అర్చనా విధులపై ఈతరం అర్చకుల్లో అవగాహన కల్పించే దిశగా ఈ సదస్సు కొనసాగినట్లు తెలిపారు. ఈ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పండితులతో పాటు దక్షణాది రాష్ట్రాల నుంచి ప్రముఖ శివాచార్యులు హాజరైనట్లు సదస్సు నిర్వాహకుడు, ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, కార్యదర్శి హరికిషన్‌శర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌శర్మ, నీలకంఠశర్మ, నాగలింగం, జయకిశోర్‌, శివరామకృష్ణ, మోహన్‌శర్మ, మృత్యుంజయశర్మ, మణికంఠశివ చార్యులు, శ్రీకాంత్‌శర్మ, రాంబాబు, సురేష్‌, శశికుమార్‌శర్మ, జగదీష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో 1.10 టీఎంసీల నీరు

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌ నియోజకవర్గం చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 1.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సూర్యాపేట జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నా చెప్పుకోదగ్గ రీతిలో నీరు ప్రాజెక్టులోకి చేరడం లేదు. దీంతో నీటి మట్టం అడుగుకు చేరింది. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 45.77 టీఎంసీలు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 208 క్యూసెక్కులు కాగా వివిధ రూపాల్లో అవుట్‌ఫ్లో 50 క్యూసెక్కులుగా నమోదైంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టులో 31.37 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చికిత్స పొందుతూ వలస కార్మికుడు మృతి

చౌటుప్పల్‌: పాముకాటుకు గురైన వలస కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. చౌటుప్పల్‌ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌ రాష్ట్రం రాంచీ జిల్లా మహువాజరీ గ్రామానికి చెందిన సుజిత్‌ మహాలి చౌటుప్పల్‌ మండలంలోని పంతంగి గ్రామ శివారులో గల నైల్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీ సమీపంలోని లక్ష్మీనర్సింహ్మా వెంచర్‌ వద్ద అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 28వ తేదీన అర్ధరాత్రి సమయంలో సుజిత్‌ మహాలి ఇంట్లో నిద్రిస్తుండగా.. పాము కాటువేసింది. పాము కాటువేయడాన్ని గుర్తించిన సహచర కార్మికులు అతడిని వెంటనే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నైల్‌ కంపెనీకి చెందిన లేబర్‌ కాంట్రాక్టర్‌ గుండెపురం వెంకటేష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్కూల్‌ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

బీబీనగర్‌: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న స్కూల్‌ బస్సు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్‌ మండలం రహీంఖాన్‌గూడెం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రమేష్‌, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రానికి చెందిన బడుగు నరసింహ(60) తన ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం పని నిమిత్తం బీబీనగర్‌కు వచ్చి తిరిగి పోచంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బీబీనగర్‌ మండలం రహీంఖాన్‌గూడెం సమీపంలో మూలమలుపు వద్ద పోచంపల్లి వైపు నుంచి విద్యార్థులతో వస్తున్న బీబీనగర్‌లోని కిడ్స్‌ కింగ్‌డమ్‌ గ్రామర్‌ హైస్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సులోని విద్యార్థులు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలానికి స్కూల్‌ యాజమాన్యం వెంటనే చేరుకొని భయాందోళనకు గురైన విద్యార్థులను పాఠశాలకు తరలించారు. మృతుడి కుమారుడు నవీన్‌ బస్సు అతివేగంగా రావడంతోనే ప్రమాదం జరిగిందని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని బస్సును పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌

రామన్నపేట: వికలాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌ కోరారు. మంగళవారం రామన్నపేటలో నిర్వహించిన ఎన్‌పీఆర్‌డీ యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికలాంగుల సాధికారితకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు అరకొరగా ఉన్నాయన్నారు. వికలాంగుల హక్కుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి అరువయ్య మాట్లాడుతూ.. వికలాంగుల పట్ల అనుచితంగా మాట్లాడిన స్మితా సబర్వాల్‌ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. అంతకుముందు మహాసభల ప్రారంభ సూచికగా జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త బట్టు రామచంద్రయ్య, ఆర్‌.వెంకట్‌, వనం ఉపేందర్‌, బొల్లపల్లి స్వామి, కొత్త లలిత, మనోహర, తుంగ భూపాల్‌రెడ్డి, బి.పార్వతి, బల్గూరి ఆంజనేయులు, పూస బాలనర్సింహ, ఎర్రోళ్ల, ప్రేమ్‌సాగర్‌యాదవ్‌ పాల్గొన్నారు.

వెంకటయ్యకు ఎన్టీసీఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటయ్య

చందంపేట: మండలంలోని చిత్రియాల అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్‌ వాచర్‌ వై. వెంకటయ్య ఎన్టీసీఏ(నేషనల్‌ టైగర్‌ కన్జర్వేషన్‌ అథారిటీ) అవార్డుకు ఎంపికైనట్లుగా ఫారెస్ట్‌ రేంజర్‌ సాయిప్రకాష్‌ తెలిపారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అమ్రాబాద్‌ అటవీ ఫీల్డ్‌ డైరెక్టర్‌ శివడోగ్ర చేతుల మీదుగా వెంకటయ్య అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్‌, ఎఫ్‌డీఓ సర్వేశ్వర్‌ పాల్గొన్నారు.

దైవజ్ఞరత్న బిరుదు అందుకున్న లక్ష్మణమూర్తి



లక్ష్మణమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

శాలిగౌరారం: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు డాక్టర్‌ శేషభట్టర్‌ లక్ష్మణమూర్తి విశిష్ట దైవజ్ఞరత్న బిరుదు అందుకున్నారు. అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని వైఎస్సార్‌ కడప జిల్లా గండిక్షేత్రంలో గత నాలుగు రోజులుగా అఖిల భారత పంచాంగకర్తల విద్వత్‌ సభలు జరిగాయి. ఈ సభల ముగింపు సందర్భంగా మంగళవారం డాక్టర్‌ శేషభట్టర్‌ లక్ష్మణమూర్తిని సిద్ధాంతి విభాగంలో దైవజ్ఞరత్న బిరుదుతో కార్యక్రమ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్‌ కులపతి జీఎస్‌ కృష్ణమూర్తి, అఖిల భారత బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, శ్రీశైలం దేవస్థాన ఆస్థాన పంచాంగ సిద్ధాంతి బుట్టి వీరభద్ర, సింహాచలం ఆస్థాన సిద్ధాంతి తెన్నేటి శ్రీనివాస్‌, కాణిపాకం ఆస్థాన సిద్ధాంతి శివస్వామి, ప్రముఖ వేదస్మార్మ ఆగమ పంచాంగ సిద్ధాంతి బీవీఎస్‌ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై సీఐ విచారణ

శాలిగౌరారం: మండలంలోని ఓ గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగిన ఘటనపై శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలితో పాటు ఆమె తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుమార్తెపై జరిగిన అఘాయిత్యం గురించి సీఐకి చెబుతూ ఆమె తల్లిదండ్రులు బోరున విలపించారు. సీఐ వెంట ఎస్‌ఐ సైదులు, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులకు అప్పగింత



నిరాశ్రయుల కేంద్రంలో రాము

భువనగిరి క్రైం: మండలంలోని బస్వాపురం గ్రామంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి సంచరిస్తుండగా దొంగ ఏమోనని అనుమానంతో గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో అతడు మహబూబ్‌నగర్‌ జిల్లా దన్వాడ గ్రామానికి చెందిన సంపంగి రాము(30)గా తెలిసింది. అతడికి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించి పట్టణంలోని నిరాశ్రయుల కేంద్రంలో ఉంచారు.

ముగ్గురు దొంగల అరెస్ట్‌

భువనగిరి క్రైం: గ్రామాలల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి రూరల్‌ ఎస్‌ఐ ఎస్‌. సంతోష్‌కుమార్‌ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన రేగు మల్లేశ్‌, నోముల శ్రీశైలం, దయ్యాల నరేష్‌ రాయగిరిలో శివారులోని మోత్కూర్‌లో రోడ్డులో గల ఒక షాపులో సుమారు 100 మీటర్ల కాపర్‌ వైరును దొంగిలించారు. అదే విధంగా చందుపట్ల గ్రామానికి చెందిన నర్సింహ ట్రాక్టర్‌ ట్రాలీని తన వ్యవసాయ పొలంలో ఉంచగా.. దానిని కూడా దొంగిలించారు. వీరవెల్లి గ్రామానికి చెందిన జమ్ముల భిక్షపతి వ్యవసాయ భూమిలోని రెండు మోటార్లు, 12 పైపులను దొంగిలించి వాటిని అమ్ముకోవడానికి భువనగిరికి వస్తుండగా మోత్కూర్‌ ఎక్స్‌ రోడ్డు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుల నుంచి దొంగిలించబడిన ట్రాక్టర్‌ ట్రాలీ, పైపులు, టాటా ఏస్‌ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సీఎం చేతుల మీదుగా రుణమాఫీ చెక్కు



రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న లోడె శోభ (పసుపుపచ్చ రంగు చీర మహిళ)

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రానికి చెందిన రైతు లోడె శోభ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో మంగళవారం రైతు రుణమాఫీ చెక్కు అందుకున్నారు. లోడె శోభకు రహీంఖాన్‌పేట గ్రామ రెవెన్యూ పరిధిలోని ఉప్పలపహాడ్‌లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే రూ.1.50లక్షలు రుణమాఫీ కావడంతో వ్యవసాయ శాఖ జిల్లా నుంచి లోడె శోభకు మాత్రమే పిలుపువచ్చింది. సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకోవాలిందిగా అధికారులు పేర్కొనడంతో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె చెక్కును అందుకున్నారు. సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకోవడం సంతోషంగా ఉందని లోడె శోభ అన్నారు.

యాదాద్రిలో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ చైర్మన్ల పూజలు



రాష్ట్ర చైర్మన్‌ శ్రీరంగారావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు



రిటైర్డ్‌ డీజీపీ హెచ్‌జే. దొరకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ చైర్మన్‌ శ్రీరంగరావుతో పాటు సెంట్రల్‌ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ చైర్మన్లు, సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అదేవిధంగా రిటైర్డ్‌ డీజీపీ హెచ్‌జే. దొర సైతం యాదాద్రీశుడిని దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవలు వంటి పూజలు నిర్వహించారు.

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్‌

- ఒక కిలో 950 గ్రాముల గంజాయి స్వాధీనం
- పోలీసుల అదుపులో తొమ్మిది మంది, పరారీలో నలుగురు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్‌: గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను మిర్యాలగూడ రూరల్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ పరిధిలోని చెట్ల పొదల్లో సోమవారం కొందరు వ్యక్తులు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారనే విస్వసనీయ సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్‌ పోలీసులు దాడులు చేసి తొమ్మిది మందిని అరెస్ట్‌ చేశారు. అరెస్టయిన వారిని పోలీస్‌ స్టేషన్‌కు తరలించి విచారించగా.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన చెల్లా శివనాగరాజు, మంజుల లక్ష్మి ఒరిస్సా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మిర్యాలగూడ పట్టణానికి చెందిన షేక్‌ సమీర్‌, సిరిపాటి రవీందర్‌, దుద్దుడుకు అంజనేయులు, చెటిమండ్ల సుభాష్‌, ధీరావత్‌ ఉపేందర్‌, మీసాల ప్రవీణ్‌కుమార్‌, లాలుకుమార్‌, తరుణ్‌, లైటింగ్‌ సమీర్‌, దుర్గారావు, శివాజీకి విక్రయిస్తుండగా.. వారు ఈ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలోకి మార్చి స్థానికంగా విక్రయించేవారని డీఎస్పీ పేర్కొన్నారు. పట్టుబడిన వారి నుంచి 1.95 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో తరుణ్‌, లైటింగ్‌ సమీర్‌, దుర్గారావు, శివాజీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్‌ సీఐ వీరబాబు, ఎస్‌ఐ నరేష్‌, వాడపల్లి ఎస్‌ఐ రవి, వేములపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్‌, ఏఎస్‌ఐ లుయాదగిరి, రాములునాయక్‌, ఉమాపతిరావు, కానిస్టేబుళ్లు రవి, సైదానాయక్‌, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనునాయక్‌, వెంకటేశ్వర్లు, ఉషా ఇతర పోలీస సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 3.2తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

హుజూర్‌నగర్‌: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 3.2తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్‌ పట్టణంలోని ఎన్జీఓస్‌ కాలనీలో జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్జీఓస్‌ కాలనీకి చెందిన చింతలచెర్వు వీరాస్వామి బైక్‌ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం అతను మెకానిక్‌ షాప్‌కు వెళ్లాడు. అతడి భార్య అరుణ మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంటికి తాళం వేసి సమీపంలోని సైదాబీ ఇంటికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న 3తులాల బంగారు నల్లపూసల గొలుసు, 2 గ్రాముల మాటీలను ఎత్తుకెళ్లారు. వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దసూరారం గ్రామంలో..

తిప్పర్తి: తిప్పర్తి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పెద్దసూరారం గ్రామంలో మంగళవారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పెద్దసూరారం గ్రామానికి చెందిన ఎడ్లబోయిన ఎల్లేష్‌, తన భార్యతో కలిసి పని నిమిత్తం మంగళవారం ఉదయం నల్లగొండకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూశారు. బీరువాలోని 10 తులాల బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. తిప్పర్తి పోలీసులతో పాటు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు.

రసాభాసగా పీఏసీఎస్‌ సర్వసభ్య సమావేశం

- సమావేశం మధ్యలో నుంచి వెళ్లిపోయిన చైర్మన్‌
- నిరసన తెలిపిన డైరెక్టర్లు
- పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు



సర్వారం పీఏసీఎస్‌ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డైరెక్టర్లు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని సర్వారం పీఏసీఎస్‌ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మంగళవారం సంఘం కార్యాలయంలో చైర్మన్‌ వీరంరెడ్డి శంభిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి 10మంది డైరెక్టర్లు హాజరయ్యారు. వచ్చిన సభ్యులు మినిట్‌ బుక్‌లో సంతకాలు చేసిన అనంతరం ఎజెండాలో రైతులకు ఎరువుల సరఫరా, స్వల్పకాలిక రుణాల మాఫీపై చర్చ చేయాలని ఉండగా సభ్యులు దానితో పాటు గతంలో సస్పెండైన మాజీ సీఈఓను తిరిగి విధుల్లో తీసుకొనే అంశాన్ని లేవనెత్తారు. దీంతో చైర్మన్‌ మినిట్‌ బుక్‌ను తన బీరువాలో పెట్టుకొని తాళం వేసి సంఘ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. చైర్మన్‌ ఎవరికీ చెప్పకుండా సమావేశం మధ్యలో వదిలేసి వెళ్లడం ఎంత వరకు సమంజసమని, ఎక్కడికి వెళ్లాడంటూ ప్రస్తుతం సీఈఓను నిలదీశారు. చైర్మన్‌ను పిలిపించాలని, అదేవిధంగా మినిట్‌ బుక్‌ను తమకు ఇవ్వాలని కోరారు. చైర్మన్‌ బయటకు వెళ్లే సమయంలో సీఈఓతో ఏదో చెప్పి వెళ్లాడని.. అతడు ఏం చెప్పాడో తెలపాలని సభ్యులు సీఈఓపై ఒత్తిడి తీసుకొచ్చారు. అనంతరం చైర్మన్‌ రావాలి అంటూ పీఏసీఎస్‌ ముందు సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేసి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఓ గోపి మాట్లాడుతూ.. మినిట్‌ బుక్‌ను చైర్మన్‌ తన బీరువాలో పెట్టుకొని తాళం వేసుకొని వెళ్తే తానెలా బాధ్యుడిని అవుతానని అన్నారు. తన దగ్గర బీరువా తాళంచెవి లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటానని తెలిపారు.

కలెక్టరేట్‌లో మీటింగ్‌ ఉండడంతో వెళ్లా..

దీనిపై పీఏసీఎస్‌ చైర్మన్‌ వీరంరెడ్డి శంభిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా.. ఎజెండా గురించి మాట్లాడకుండా, చర్చను పక్కదారి పట్టించి గతంలో సస్పెన్షన్‌కు గురైన మాజీ సీఈఓను విధుల్లోకి తీసుకోవాలని సభ్యులు పట్టుబట్టడం సరికాదన్నారు. మాజీ సీఈఓ గతంలో రూ.10లక్షల అవినీతి చేశాడని, అందుకనే అధికారులు అతడిని విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన రూ.10లక్షలను సంఘంలో చెల్లిస్తే.. ఎజెండాలో పెట్టి తీర్మానం పెట్టి ఆయనను తీసుకొంటామని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన 2వ విడత రైతు రుణమాఫీపై కలెక్టరేట్‌లో మీటింగ్‌ ఉండడంతో తాను సమావేశం నుంచి వెళ్లానని పేర్కొన్నారు. దీనిపై డీసీఓ పద్మను వివరణ కోరగా.. సర్వారం ప్రాథమిక సహకార సంఘంలో జరుగుతున్న పరిణామాలపై పూర్తి సమాచారం తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.